# ఒక రోజు పంతులు

(ఉదయం: 11 గంటలు)

క్లాసు రూము. కుర్రాళ్లు గోలగా ఉంటారు. రాజారావు మేష్టారు వస్తారు.

ఒక కుర్రాడు: అరేయ్. మేష్టారు వస్తున్నార్రోయ్.

రెండవ: ఎవర్రా...రాజారావు మేష్టారేనా...

ఒకటవ: అవునురా...గప్......చిప్. (క్లాసంతా నిశ్శబ్దం అవుతుంది.)

రాజారావు మేష్టారు: అబ్బాయిలూ... కూర్చోండి......అప్పుడే అయిదు నిమిషాలయిపోయాయి. పాఠం మొదలెట్టాలి. నిన్న ఎంతవరకు వచ్చాము. మానిటర్.

మానిటరు: నిన్నటి పాఠం అయిపోయిందండి. యివాళ కొత్త పాఠం చెబుతామన్నారు.

రాజా: ఆ! సారీ...సరే...ఏదో పాఠం తియ్యండి...చూశారూ...యీ పద్యాల అర్థమూ, భావమూ చాల గొప్పగా ఉంటాయి. మానవులు, ముఖ్యంగా విద్యార్థులు నేర్చుకోనవలసినవి యిందులో చాల ఉన్నాయి. యీ పద్యాలని షేక్స్పియరు అనే మహాకవి రాశాడు

యితడు ఆంగ్లేయుడు. ఎన్నో గొప్ప నాటకాలు, పద్యాలు రచించాడు. సరే. అసలు పాఠంలోకి వద్దాం. మానిటర్... చదువు.

(ప్యూన్ నోటీసుతో ప్రవేశిస్తాడు.) సమయానికి వచ్చాడు.-హుం...అదిగో నే హంసపాదు ..పిల్లలూ వినండి. *please grant me leave,...*

(క్లాసంతా గొల్లుమంటారు. బల్లలు గుద్దుతారు.)

(చికాకుగా) ఏమిటిరా యిది. సెలవు చీటీ తెచ్చావు.

ప్యూన్: అయ్యో...నోటీసు కాగితం యిది బాబయ్యా. ఆ కాగితం యిలా యియ్యండి. రాంబాబుగారు యిచ్చారు.

రాజా: ఏడిసినట్టే ఉంది. ఏదీ...... వినండి......ప్రసిద్ధ పురుషులయిన మహా మహులుగారు విచ్చేసిన సందర్భంలో, బడికి మధ్యాహ్నంపూట, వారి గౌరవ సూచనగా, సెలవు యిచ్చారు. (ప్యూన్ వెళ్లిపోగా క్లాసంతా చప్పట్లు కొడతారు.) సైలెన్స్——...అప్పుడే యిరవై నిమిషాలు అయిపోయాయి. యిక పావుగంటలో ఏం చెప్పను...నా మొహం. అందరూ బెల్లు కోసం చెవులు నిక్కపొడుచుకున్నారు. నా పాఠం ఎవరు వింటారూ. అయినా ...మానిటర్...మొదలుపెట్టు.

మాని: (బిగ్గరగా)

*Every one that flatters thee,*
*Is no friend in th y misery.*

రాజా: ఆవు...ఈపాఠంలో స్నేహధర్మంగురించి చెప్పబడింది. ముఖ్యంగా మీలాంటివాళ్లు, ఈపాఠం గ్రహించి, అల్లాగే నడుచుకోవాలి. ఏదైనా మనిషిశీలం అతని మిత్రులనిబట్టి ఉంటుందని...

వేరే క్లాసుకుర్రాడువచ్చి: మేష్టారండీ.. వెంకటప్పయ్య పంతులుగారు కొంచెం నశ్యం వేయించుకొని రమ్మన్నారండీ.

రాజా: ఛా...వెధవా...రసపట్టులో కనిలా వచ్చావు...ఊఁ...యింద...వెళ్లు.. ఎంతవరకు చెప్పాను.

**శ్రీ వంగల వేణుగోపాలాచార్య**

మానిటరు: అంతేనండి.

రాజారావు: ఏమిటిరా...అంతే.

మాని: తెలియదండీ.

రాజా: హోరి వెధవల్లారా...మీదృష్టి యిక్కడుంటేగా ..యీ ఆఖరిపీరియడు వేసి నాపీకకి తెస్తార్రాపీళ్ళు. మొదటి పీరియడు వెయ్యండ్రా అంటే వెయ్యరు. ఆఖరున మీకు వినాలని ఉండదు. నాకు చెప్పాలనీ ఉండదు. యీ పాఠం ఎంతో బాగా చెప్పాలని ఎంతో ఉత్సాహపడ్డాను.

1. కుర్రాడు: (లేచి) మేష్టారండి (అని చిటికెనవేలు చూపుతాడు)

రాజా: నా వాగుడేకాని, మీ కార్యక్రమాలు సాగుతూనే ఉంటాయిరా-వెళ్లు ఊ...స్నేహాన్ని గురించి కదూ చెప్తుంట-వినండి...(యీసారి యింకో అయిదుగురు లేచి చిటికెన వేలు చూపుతారు)..హోరి. మీ దుంపతెగా...అన్నీ వరసాగ్గా వస్తున్నాయిలా ఉందిరా. ఈపాఠంలో ఎంత అర్థముంది! ఎంత భావముంది! పశువులు.. వెళ్ళండి... మిగిలినవాళ్లు వినండి. రేపటి పరీక్షలలో యిది చాల ముఖ్యం. స్నేహధర్మాలని గురించి యీ కవి, వివరిస్తూ ఏమన్నాడండీ.

(యింతలో హెడ్మాష్టారువస్తే క్లాసంతా లేచి నిలబడతారు)

హె-మా: రాజారావుగారూ...మాట... మీరు సాయంత్రం యింటికి వెళ్లేటప్పుడు, ఒకసారి అల్లా మా యింటికి వస్తారుకదూ.. మర్చిపోకండీ...తప్పకుండా రండి...రిటర్న్లు కంపేర్ చెయ్యాలి.

(హె-మా...వెళ్ళిపోతారు)

రాజా: చిత్తమండి...అల్లాగే...... (నిట్టూర్పు వదుల్తూ)......ఒట్టుపెట్టినట్టు పాఠం మాత్రం సాగనివ్వటంలేదు. ఉన్నవి నలభయి నిమిషాలు. అందులో నోటీసులూ, సద్దుకోవడాలూ...సమాధానాలూ... వీటితోనే సాగిపోతోంటే...యిక చదు వేం చెప్పనూ, నా మొఖం. ఎంత ఉత్సాహంగా పాఠం చెప్తామని వచ్చానో అంత డిగజారిపోయాను...కనీసం పాఠం చెప్పే అరగంటయినా స్వేచ్ఛగా ఉండనివ్వరు...సరే.. పిల్లలూ...యీ పద్యభాగంలో స్నేహాంలో రకాలని గురించి...

మానిటర్: సార్......అటెండెన్స్ వెయ్య లేదండి.

రాజా: హోరి శిష్యుడా, బాగా జ్ఞాపకం చేశావు...ఏదీ...నెంబర్లు పలకండి.(పిల్లలు చకచకా నెంబర్లు పలుకుతుంటే బెల్లు కొడతారు.) అయింది...అనుకున్నంతా అయింది. పుణ్యకాలం కాస్తా తీరిపోయిది. అయినా చివరిఘడియలలో ఏ పని అయినా యిల్లాగే ఉంటుంది.....త్వరగా నెంబర్లు పలికి...వెళ్లండి.

*　　　*　　　*


[సాయింత్రం 6 గంటలు. రాజారావు యిల్లు.]

రాజా: ఒసేవ్...యిదిగో...ఊహు చస్తే పలకదండీ...ఏమేయ్.....ఎక్కడ తగలడ్డావేవ్.

భార్య: దొడ్లో తగలడ్డాను. దొడ్లో నించి యింట్లోకి నడవాలా, ఎగిరి రావాలా? ఏమిటా రాజకార్యం.

రాజా: చూడూ...ఏమైనా ప్రయత్నిం చేశావా.

భార్య: రెండు శేర్ల బియ్యం తెచ్చేటప్పటికి తలప్రాణం, కాళ్ళకి దిగింది.



లక్ష్మమ్మగారికి కొబదలు నాలుగు రూపాయిలూ, నాగరత్తానికి గంధకుంచాలయ్యాం, పాలదానిదగ్గర అయిదు రూపాయిలూ, కాంతంగారికి, నూనీ...ఎల్లాగో కాంతంగారినే అడిగితెచ్చా ఈ అద్దెడు బియ్యమూ.

రాజా : మంచిపని చేశావు.. రేపేగా ఒకటవ తారీకు. సాయంత్రం అందరికీ యిచ్చేద్దాములే.

భార్య: మహా యిచ్చేవారిలా చెబుతారు. పాలదానికి మూడునెలలబాకీ యివ్వాలి. కోమటికి సరేకదా...పులిబుర్ర కాగితం... యికపోతే యింటాయన పోరుగూరు కనుక తరచు అడగడుకదా.

రాజా : అందరికంటె పెద్ద అప్పుల దానివి నువ్వున్నావుగా...నామాట వినకుండా, అల్లుళ్ళను రప్పించి, పండగలు చేశావు...పండగలు...డబ్బేమయినా ఊరుతోందనుకున్నా వేమిటి...యివన్నీ సద్దుకోవడానికీ.

భార్య : అయ్యోరామా ! కూతుళ్ళనీ, కొడుకులనీ, అల్లుళ్ళనీ పండగలకి రప్పించుకోవడంకూడ ఖర్చుటండీ. మనయింటిపన్లు మనం చేసికుంటాంగాని లోకానికి ఉద్ధరించేమిటి...అదయినా మీ గొప్ప ఏముందీ.. ఏదో కాంతంగారి దయవల్ల...

రాజా : ఆ...రేపు ఆ బాకీ తీర్చేటప్పుడు తెలుస్తుంది. ఎవరిదయో.

భార్య : అయినా......మీరు కూడ కాంతంగారి మొగుడిలా ఏమైనా రాయకూడదుటండీ...కంపెనీలవాళ్ళు డబ్బు యిస్తారుట.

రాజా : అదొకటే తక్కువ, అయినా అవేం కథలూ...యిల్లుట...పిల్లలుట, వంటిదేశు స్తే ఆముదంపట్టారు

భార్య : నాకు మాత్రం ఆ కథలు బాగుంటాయండీ...అచ్చు మనింట్లో గొడవల్లా ఉంటాయి. కాని ఒకటే తేడా— కాంతం మొగుడు భార్య మాట వింటాడు, మీరు వినరు, అంతే.

రాజా : తీర్చవలసిన బాకీలు...వచ్చే జీతమూ, చెయ్యవలసిన బాకీలూ లెక్క చూడకుండా, కాంతంగారి కథల్లో పడ్డా వేమిటి, వాళ్ళలెక్క తేల్చకపోతే, ముందు మనకథ పడతారు. యిది నెలాఖరు అనే సంగతి జ్ఞాపకముందా.

భార్య : ఆ...ఏం చెప్పినా నెలాఖరులో చెల్లుతుంది. ఇచ్చేవాళ్ళలా అందరికీ 'ఒకట్లో తారీక' నేగా సమాధానం! తీగా ఒకట్లో తారీకువస్తే, అందరినీ సద్దిచెప్పలేక నాకు ప్రాణం కడబడుతుంది.

రాజా : ఏం చెయ్యమంటావు. అన్నట్టు ట్యూషన్ కుర్రాడు ఫీజు తెచ్చి యిచ్చాడా.

భార్య : మీదగ్గర కుర్రాళ్ళకి ఆ అలవాటుంటేగా, పయిగా వాగుడు నష్టం కూడాను. ఏదో కల్సివస్తుందని, మమ్మల్ని చంపుకుతింటారు, యిరుకు గదుల్లో వాళ్లను పెట్టుకొని.

రాజా : నీ దెప్పులకేంగాని, ఆకుర్రాడు సాయంత్రం తెస్తానన్నాడే...నేనావైపు వెళ్లివస్తానుండు...అన్నట్టు వాళ్లనాన్నకి ఒకటవ తారీకు నేగా జీతం రావడం. నా సమాధానం నాకే వస్తుంది. నెలకి కనీసం నాలుగైదు, ఒకట్లో తారీకులువస్తే బాగుండున్ను. నెలాఖరులో అన్ని చిన్ని సంసారాలు యింతే గాబోలు ఖర్మం...

* * *

(ఆరాత్రి 10 గంటల సమయం—రాజారావు తండ్రి 60 ఏళ్ళవృద్ధు, నులక మంచంమీద కూర్చొని ఉంటాడు. బుడ్డి

## ★ ఒకరోజు పంతులు ★

...పం ముందు పిల్లలు బిగ్గరగా చదువుతూ ...ంటారు)

తండ్రి: అబ్బాయీ! రెడ్డిగారు నీకోసం వచ్చి వెళ్ళారురా.

రాజా: ఏం...ఎందుకూ.

తండ్రి: ఆయనకొడుకు నీక్లాసేటగా, ట్యూషన్ చెప్తావేమో కనుక్కుందామని వచ్చారు.

రాజా: ఉన్న వాళ్ళు ఉద్ధరిస్తున్నది చాలు. నేను ధర్మబుద్ధిగా నలుగురు కుర్రాళ్లని చేర దియ్యడమూ... చూశేవాళ్లకి యిదో గొప్పఆదాయంలా కనపడటమూ.

తండ్రి: పోనీ లేరా...వీలయితే నే చెప్పు...నీకు యీ మాత్రం చదువు చెప్పించడానికి మేమెంత కష్టపడ్డామో గుర్తుందా. మనం కష్టపడి అయినా పిల్లలకి విద్యాభిరుచి కల్పించాలి. అప్పుడే వాళ్ళ జీవితాలు సక్రమంగా నడుస్తాయి. విద్యాదానం లాంటిది యింకోటిలేదు.

రాజా: అసలు నాకు తీరిక ఎక్కడిదీ, పయిగా వీళ్ళకి పరీక్షలముందు కానీ ట్యూషన్లు గుర్తుకు రావు-ఏడాది చివరలో వాళ్లకి నేను చెప్పేదేమిటి...వాళ్ళకి అర్థమయ్యేదేమిటి..నా మొఖం.

తండ్రి: అయితే తోటిమాష్టర్లందరూ అన్ని ట్యూషన్లు చెప్తున్నారు ?

రాజా: ఏముందీ...డబ్బు...చేతిలో పనిగీకితే,నాలుగురాళ్ళు పడతాయి చేతిలో.. ఒక్క నీతిని చంపుకుంటే.

తండ్రి: ఛీ...ఛీ...మనం లోకాన్ని ఉద్ధరించకపోయినా, మన జీవితాలనయినా, స్వచ్ఛంగా, గడపడం మనచేతిలో పని. అబ్బాయీ...భగవద్గీత చదివే వేళ అయిందా...

రాజా: ఒకే బాదిగా...తాతయ్యకి గీత పుస్తకం తెచ్చివ్వు. నేను ఒకసారి అలా వెళ్లి వస్తాను నాన్నా...మీరు చదువుకొని పడుకోండి.

భార్య (ప్రవేశించి): యింత రాత్రిలో ఎక్కడికండి, ఉదయమే వెళ్ళరాదూ:

రాజా: అయ్యో...అలాగే...యిదేం కాకీ అనుకున్నావేమిటి వాయిదా వేయడానికి. ఇల్లాంటప్పుడే నలుగురం చేరి పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకొనడానికి వీలు... విశ్రాంతిగా...తలుపు దగ్గరగా వేసిఉంచు.

* * *

(అదేరాత్రి 12 గం|| అరు బయట రాజారావు, ముగ్గురు మేష్టర్లు గుండ్రటిబల్లచుట్టు కూర్చుంటారు. మధ్య కిరసనాయిలు దీపం వెలుగుతోంది. సిగరెట్టు పెట్టెలు, చిందర

"ఇది నిజము..

...మీరు లక్స్ టాయిలెట్ సబ్బుతో

ఇంకా మనోహరముగానుండవచ్చును"

అని సావిత్రి

చెప్పుచున్నది



నిజముగా వంకరలైన నియమము తప్పని సౌందర్య పద్ధతి ఇదిగో: "మామూలుగాకూడా కొన్ని మీగడవంటి లక్స్ టాయిలెట్ సబ్బు నురుగును నేను నా చర్మముమీద బాగా రుద్దుతాను. తరువాత నేను కడుగుకొని ఒక మెత్తని తువ్వాలుతో అద్దుకొనగానే నా చర్మము ఒక క్రొత్త అందమును తెచ్చుకొనును." అని సావిత్రి చెప్పుచున్నది.




లక్స

టాయిలెట్ సబ్బు

సినీమా తారలకు

సౌందర్యమునిచ్చు సబ్బు

LTS. 377-X30 TL

డాన్ క్విక్ సెట్

వెల రూ. 2-0-0

ఆంధ్ర గ్రంథమాల,

మద్రాసు- 1

వందరగా పడిఉంటాయి.)

రాజా : అయితే శర్మా! యీ ఉద్యోగాలు నాకేమీ నచ్చలేదురా. దీనికంటే ఏ పల్లెకోపోయి, నలుగురు రెడ్లనాశ్రయించుకుంటే జీవితం నిశ్చింతగా వెళ్ళిపోతుంది.

శర్మ : అదేమిటి...మాలో కల్లా నీని యరువి. నీకే అంత విసుగా!

రాజా : కాకపోతే ... నీకూ నల్గురు పిల్లలు పుట్టేసరికి తెలుస్తుంది యిలా ఎందుకన్నానో. గంటల తరబడి, బడిలో వాగి వాగి, కొంప చేరేసరికి, యింత శుభ్రమయిన కాఫీ, వేళకి భోజనంవచ్చే అవకాశం లేక పోయాక ఎందుకురా...యీ చదువులూ.. ఉద్యోగాలూ...

శర్మ : కనుకనే ఓర్పు, శాంతి, సహనము, పట్టుదలా మూర్తీభవించినవారికే ఈ మాష్టరు వృత్తి.

పాపయ్య: కాస్త పౌరుషం దించుకొని, కూలికిపోతే రోజుకి కనీసం, మూడున్నరో, నాలుగో సంపాదించవచ్చు.

రాజా : ఒక్కొక్కసారి పాఠం చెప్పకుండా ఎగవేద్దామనుకుంటాను. కాని తీరా వాళ్ళ చిన్న మొఖాలు చూసేవరకు, వాళ్ళ జీవితాలన్నీ మనం చెప్పే నాలుగు ముక్కలమీదే ఆధారపడి ఉంటాయి కదా, అని మళ్ళీ సద్దుకుంటాను. కాని యీ మంచితనం ఎవరికీ తెలియదు.

శర్మ : మీనాన్న రోజూ గీత చదువుతాడు గదా. నీకు యీమాత్రం తెలియదురా. 'మనం మంచిపని చెయ్యడంవరకే గాని, దాని ఫలితాన్ని గురించి ఆలోచింపకూడదని. ముఖ్యంగా మేష్టర్లం దీన్ని ఆచరణలో పెట్టాలి.

రాజా : ఆమాటకి వస్తే గీతలో యింకా చాల చెప్పాడు, 'వినాశాయచ దుష్కృతాం, ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని. తోటి మేష్టర్లకి తలవంపులు తెచ్చే అవినీతి పనులు చేసే టీచర్లనూ, మేనేజిమెంటు కమిటీలకు తొత్తులను, బహిరంగపరచి, కలికావతారం ఎత్తుతాను.


పాపారావు: రాజీనామా కాగితం చేత్తో పట్టుకొని మరీ ఎత్తు కలికావతారం, ఎందుకయినా మంచిది.

రాజా : అంతేరా ... నిజము చెస్తే యింతేరా...యింత చదువుకున్నందుకు, ఎంతో ఆదర్శంగా, ఉన్నతంగా జీవించాలనుకుంటే, చివరకి పూటగడవటం కష్టమయిపోతే...ఖర్మ...

శర్మ : ఋషుల్లా, కందమూలములూ, గాలి సేవించి జీవించగలశక్తి ఉంటే, ముఖ్యంగా మేష్టర్ల జీవనం సుఖంగా ఉంటుంది. ఏపేచీ ఉండదు. లేదా అవి నీతికి దిగి, ట్యూషన్ల సాకుతో డబ్బు లాగాలి. రెండూ చేతగాని మనం...యిల్లా గొర్రెల్లాగా జీవితం గడపవలసిందే.

రాజా : ఇది రోజూ ఉన్నగొడవే... తెల్లారితే మళ్ళీ, యంత్రాల్లా దినచర్యలో సాగిపోవాలి...ఏదైనా కాస్సేపు ఖులాసాగా కబుర్లు చెప్పండి...నిద్రకూడ వస్తోంది. ★

వేడిగానున్నప్పటికీ
ఆనందము
మరియు
ఉత్సాహము!



వేడి వాతావరణమువల్ల జీర్ణకోశము మందముగా ఉండవచ్చును... అప్పుడు శరీరములో విషమాలిన్యములు కూడుకొని మీకు భారంగా అలుపుగా, నిరుత్సాహంగా ఉంటుంది. తళతళ మెరయుచు పొంగే ఈనోస్ "ఫ్రూట్ సాల్ట్"ను పుచ్చుకోండి. అది మీకు ఎంతో ఉత్సాహమునిస్తుంది. దాని సౌమ్య విరేచన గుణము మీలోని అపాయకరమగు మాలిన్యములన్నిటిని తొలగించుటలో సహకరించి మిమ్ములను హాయిగా, ఉత్సాహంగా ఉంచును.

ఈనోస్
'ఫ్రూట్ సాల్ట్'
మిమ్ములను ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉంచును

తాజా గుణము చిరకాలముండుటకుగాను
సీసాలలో అమ్మబడును

"ఈనో" మరియు "ఫ్రూట్ సాల్ట్"
అను మాటలు రిజిష్టర్డు ట్రేడ్ మార్కులు

